

స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## సీఎం సభాస్థలి పరిశీలన

నిజాంసాగర్, అక్టోబర్15: ఎన్నికల ప్రచారంలో భాగంగా జుక్కల్ నియోజకవర్గానికి ఈ నెల 30వ తేదీన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రానున్నారు. ఇందుకోసం జుక్కల్ చౌరస్తాలో సభను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు స్థలాన్ని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ఆదేశాల మేరకు జుక్కల్ మండల నాయకులు ఆదివారం పరిశీలించారు. జుక్కల్ చౌరస్తాలో స్థలం అనువుగా ఉన్నదని నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కేంద్ర బిందువు కావడంతో జుక్కల్‌లోనే సభ నిర్వహించడం సబబని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నీలూపటేల్, సాయాగౌడ్, సొసైటీ చైర్మన్ శివానంద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాధవ్‌రావు దేశాయ్, జాగృతి మండల కన్వీనర్ అనితాసింగ్, సర్పంచులు కపిల్ పాటిల్, రవి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## 270 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 15 : ప్రభుత్వం పేదవారి కోసం రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొంతమంది దళారులు అక్రమంగా కొనుగోలు చేసి, అడ్డదారుల్లో ఇతర రాష్ర్టాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు పీడీఎస్ రైస్ తరలిస్తున్నారనే సమాచారంతో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆదివారం దాడి చేసింది. ఓ లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు తరలిస్తుండగా నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డు వద్ద దాడిచేసి లారీని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నది. సుమారు 270 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ బ్యాగులను తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్‌తోపాటు రేషన్ బియ్యం ఉన్న లారీని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

# గులాబీ జెండా.. సంక్షేమమే ఎజెండా

నిజామాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి) ప్రజల ఎజెండాతో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి ప్రజల ముందుకు వచ్చింది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడమే ధ్యేయంగా ప్రజల అవసరాలను తీర్చేందుకు నడుం బిగించింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్న వేళ.. మిగిలిన రాజకీయ పార్టీల కన్నా మిన్నగా ముందుస్తుగానే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ అధినేత... తాజా గా మ్యానిఫెస్టోను సైతం డిక్లేర్ చేశారు. ఇందులో సబ్బండవర్గాలకు మేలు చేసే హామీలు ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇదే చర్చ నడుస్తున్నది. ముఖ్యంగా అభాగ్యులకు పింఛన్ల పెంపు సాహసోపేతమైన నిర్ణయంగా మేధావులు కీర్తిస్తున్నారు. అనాథ పిల్లలను ఆదుకునేందుకు ప్రత్యేక విధానాన్ని తీసుకు రాబోతుండడం బీఆర్‌ఎస్ మానవీయతకు అద్దం పడుతున్నది. మహిళలకు భృతి, సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపు ఒకటేమిటి అనేకానేక పథకాల సమాహారంతో సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల హామీలు ఎంతో ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే చెప్పినవి చేసి, చెప్పనివి సైతం అమలు చేసి ప్రజలందరికీ ఎంతో మేలు చేసిన సీఎం కేసీఆర్ పరిపాలనను దేశ వ్యాప్తంగా కీర్తిస్తున్నారు. మూడోసారి అధికారంలోకి రావడం ద్వారా ప్రజలకు మరింత మేలు జరుగనున్నది. కేంద్ర ప్రభుత్వం అమానవీయంగా ఎల్పీజీ ధరలను పెంచితే అధికారం చేపట్టిన తర్వాత రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పడం బీఆర్‌ఎస్ పార్టీ గొప్పతనాన్ని చాటుకుంటున్నది. ఇక రైతుల మేలు కోసం పెట్టుబడి సాయాన్ని భారీగా పెంచడంతో వ్యవసాయం పండుగలా మారనున్నది.

**దళితబంధు, రైతుబీమా కొనసాగింపు..**

గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగింపు ఉంటుందని కేసీఆర్ చెప్పడంతో గిరిజనుల్లోనూ హర్షం వ్యక్తమవుతున్నది. గతంలో ఇచ్చిన హామీ మేరకు నిజామాబాద్ రూరల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్, కామారెడ్డి, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లో పలువురికి పట్టాలు అందించారు. ఏండ్లుగా పడుతున్న వెతలను ప్రభుత్వం తీర్చింది. హక్కు పత్రాలను అందించి పోడు వ్యవసాయదారుల్లో ధీమాను కల్పించింది. పోడు పట్టాలు అందించడంతోపాటు భవిష్యత్తులో గిరిజనులకు మరిన్ని పథకాలు అమలు చేయనున్నారు. మరోవైపు లంబాడా తండాలు, గోండు గూడెం పంచాయతీలుగా మార్పు సైతం మేనిఫెస్టోలో బీఆర్‌ఎస్ పేర్కొన్నది. దళితబంధు, రైతుబీమా వంటి కీలకమైన పథకాలు కొనసాగింపు ఉంటుందని స్పష్టం చేశారు. రైతుబీమా తరహాలోనే కేసీఆర్ బీమా ప్రతి ఇంటికీ ధీమా పేరుతో రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి పేద ఇంటికీ ఎల్‌ఐసీ ద్వారా రూ.5లక్షల జీవిత బీమా అందించబోతున్నారు. ఆరోగ్య శ్రీ గరిష్ఠ పరిమితి రూ.15లక్షలకు పెంచుతున్నట్లుగా బీఆర్‌ఎస్ అధినేత చెప్పారు. మూడోసారి అధికారంలోకి రాగానే ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలను కొనసాగించడంతోపాటు కొత్త హామీలను ఆరు నెలల్లోనే అమలు చేస్తామని కేసీఆర్ చెప్పడంతో అందరిలోనూ నమ్మకం కుదిరింది.

**రైతు బాంధవుడు కేసీఆర్..**

వ్యవసాయాన్ని పండుగలా మార్చిన సీఎం కేసీఆర్ మరోసారి రైతులకు శుభవార్త చెప్పారు. రైతుబంధు కింద ఎకరానికి రూ.10వేల చొప్పున ప్రతి సంవత్సరం సాగు ఖర్చుల నిమిత్తం అందిస్తున్నారు.



ఈ ఆర్థిక సాయాన్ని పెంచుతూ ఎన్నికల హామీలో నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 60 నుంచి 70శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పదేండ్లలో వ్యవసాయ స్థిరీకరణ విజయవంతంగా అమలు చేయగా ఉత్పాదకతను పెంచుకుంటూ వ్యవసాయ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ యోచిస్తున్నది. రైతుబంధు పథకాన్ని రూ.16వేలకు పెంచుతూ ఎన్నికల హామీని ప్రకటించింది. ఇది కూడా మొదటి ఏడాది రూ.12వేలు పెరుగుతుంది. ప్రతి ఏడాది కొంత పెరుగుతూ ఐదో ఏడాదికి రూ.16వేలకు చేరుకుంటుంది. 2018, మే 10న మొదలైన రైతుబంధు పథకం విజయవంతంగా ప్రారంభమైంది. నిజామాబాద్ జిల్లాలో పథకం ప్రారంభమైన సమయంలో 2.39లక్షల మంది రైతులున్నారు. ఈ సంఖ్య ఇప్పుడు 2లక్షల 60వేలకు చేరింది. కామారెడ్డి జిల్లాలో 2లక్షల 42వేల మంది నుంచి ఇప్పుడు 2లక్షల 75వేల మందికి పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ఐదున్నర లక్షల మందికి రైతుబంధు సాయం అందుతున్నది. ప్రతి సీజన్‌లో రూ.500 కోట్లు పెట్టుబడి సాయంగా వెచ్చిస్తున్నది.

**మహిళలకు సౌభాగ్యలక్ష్మి..**

సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన పేద మహిళలకు ప్రతినెలా రూ.3వేల చొప్పున భృతి చెల్లించబోతున్నారు. అర్హులైన పేదలతోపాటు అక్రిడిటేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టుకు రూ.400కే గ్యాస్ సిలిండర్ సైతం అందించబోతున్నారు. ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు కేసీఆర్ ఆరోగ్యరక్ష పేరుతో రూ.15లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తింపజేయనున్నట్లుగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించడంతో ఆ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. పవర్ పాలసీ, అగ్రికల్చర్ పాలసీ తదితర విధానాలను యథాతథంగా కొనసాగించబోతున్నారు. తెలంగాణ అన్నపూర్ణ పథకం ద్వారా తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు సన్నబియ్యం అందజేయబోతున్నారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత పుట్లకొద్దీ వడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. దండిగా ధాన్యం రాశులు వస్తుండడంతో మన భూముల్లో పండిన పంటను మర ఆడించిన తర్వాత ఇక్కడే ప్రజలకు అందించేలా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేయబోతున్నది. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తారు. అగ్రవర్ణ పేదల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామని కేసీఆర్ చెప్పడంతో సంబంధీకుల్లోనూ సంతోషం కనిపిస్తున్నది.

**ఆసరా.. అద్భుతం..**

ఆసరా పింఛన్లను మూడోసారి వచ్చే ప్రభుత్వంలో రూ.5వేలకు పెంచబోతున్నట్లుగా కేసీఆర్ చెప్పడంతో అభాగ్యుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ స్కీమ్‌లో భాగంగా వచ్చే ఏడాది మార్చి తర్వాత రూ.3వేలు అమలు చేయబోతున్నారు. ప్రతి ఏడాది రూ.500 చొప్పున పెంచుతారు. ఐదో సంవత్సరం నాటికి రూ.5వేలు ఇస్తారు. మొదటగా రూ.వేయి పెంచి ఇవ్వడంతోపాటు ఏటా రూ.500 చొప్పున పెంచి ఇవ్వబోతున్నారు. అచ్చంగా ఇలాగే దివ్యాంగుల పింఛన్‌ను అమలు చేయబోతున్నారు. ఇటీవలే దివ్యాంగులకు పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ప్రభుత్వం అమలు చేస్తున్నది. వీరికి రూ.6వేలు అందివ్వబోతున్నారు. మార్చి తర్వాత రూ.5వేలు అందిస్తారు. ప్రతి ఏటా రూ.300 పెంచుకుంటూ ఐదో సంవత్సరం నాటికి రూ.6వేలు అందిస్తారు. నిజామాబాద్ జిల్లాలో ప్రతినెలా రూ.60కోట్ల మేర 3లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయి. ఇందులో దివ్యాంగులు 20వేల మంది వరకు ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో లక్షా 80వేల మందికి పింఛన్లు అందుతుండగా రూ.35కోట్లు ప్రతి నెలా వెచ్చిస్తున్నారు. ఇందులో 19వేల మంది దివ్యాంగులు ఉన్నారు.

### తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



బాన్సువాడ, అక్టోబర్ 15: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టో అద్భుతం. సంక్షేమ పథకాల అమలుతో కేసీఆర్ పాలన రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగం. రాష్ట్రంలోని ప్రతి ఇల్లు ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతుంది. రాష్ట్ర సంపదను పెంచి, ఆ సంపదను పేదలకు పంచుతున్నారు. ప్రస్తుత పథకాలకు అదనపు పెంపుతోపాటు నూతన పథకాలను మ్యానిఫెస్టోలో పొందుపర్చడం హర్షణీయం. రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలనలో చేపట్టిన పథకాలు ఎంతో గొప్పవి. రాష్ట్ర ప్రజలంతా ఆలోచించి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించి, తమ భవిష్యత్తు కోసం ఓటు వేసి ఆశీర్వదించాలి.

- పోచారం శ్రీనివాసరెడ్డి, స్పీకర్

### మ్యానిఫెస్టో అదుర్స్..



ఖలీల్‌వాడి, అక్టోబర్ 15: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో బాగున్నది. రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.3వేలు, తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులందరికీ బీమా సౌకర్యంతోపాటు సన్నబియ్యం పంపిణీ లాంటి అంశాలు పేదలకు మేలు చేసేవే. అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందేలా రూపొందించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

- దాదన్నగారి విఠల్‌రావు, జడ్పీ చైర్మన్

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఖరారు

కమ్మర్‌పల్లి/బోధన్/నందిపేట్, అక్టోబర్ 15: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం ఆదివారం ప్రకటించింది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని పలు నియోజకవర్గాలకు పేర్లను ఖరారు చేసింది. బాల్కొండ కాంగ్రెస్ టికెట్ సునీల్ కుమార్ ముత్యాల పేరును ప్రకటించింది. బోధన్ నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా పొద్దుటూరి వినయ్ కుమార్ పేరును ప్రకటించింది.

## తండ్రి చేతిలో తనయుడి హతం

రెండో పెండ్లి, పొలం డబ్బుల విషయంలో ఘర్షణ



శ్రీకాంత్ (ఫైల్)

నవీపేట, అక్టోబర్ 15 : తండ్రి చేతిలో కొడుకు దారుణ హత్యకు గురైన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం మోకన్‌పల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, స్థానిక ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంగెం కిషన్‌కు కొడుకు శ్రీకాంత్, కూతురు ప్రియాంక ఉన్నారు. రెండేండ్ల క్రితం కిషన్ భార్య మమత గుండెపోటుతో మృతి చెందింది. ఆరు నెలల క్రితం కిషన్ తనకు ఉన్న 20 గుంటల భూమిని రూ. 9లక్షలకు విక్రయించాడు. వచ్చిన డబ్బుల్లో రూ. 5లక్షలు అప్పులు చెల్లించగా మిగిలిన రూ. 4లక్షల్లో కొంత తనకు ఇవ్వాలని శ్రీకాంత్ తండ్రిని కోరాడు. ఈ విషయమై తండ్రీ కొడుకుల మధ్య తరచూ గొడవ జరిగేది. తన రెండో పెండ్లికి అభ్యంతరం చెప్పడంతోపాటు పొలం డబ్బులను అడుగుతుండడంతో కొడుకును ఎలాగైనా మట్టుబెట్టాలని పథకం పన్నాడు. కోడలు పుట్టింటికి వెళ్లడంతో ఇదే అదనుగా భావించిన శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రలో ఉన్న కొడుకు శ్రీకాంత్‌ను కర్రతో తలపై బలంగా మోది హత్య చేశాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు గుట్టు చప్పుడు కాకుండా అలాగే ఉంచాడు. విషయం బయటికి రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ పరిశీలించి వివరాలను సేకరించారు. శ్రీకాంత్ భార్య రూప ఫిర్యాదు మేరకు కిషన్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

## మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ

వేల్పూర్, అక్టోబర్ 15: రాష్ట్ర రోడ్లు, భవనాలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతిచెందగా, ఆదివారం ఆయనను వేల్పూర్‌లోని స్వగృహంలో ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మారగంగారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.